# మనస్సును అదుపులో ఉంచుకున్నప్పుడు జీవితము ధన్యమవుతుంది

**మనసుచే జీవులు మరి జననమొందు**
**మనసుచే జీవులు మాయమైపోవు**
**మనసుచే ధర్మార్థకామమోక్షములనొందు**
**మనసుచే యోగనిష్టలు సిద్ధినొందు**

ఆధ్యాపకులారా! విద్యార్థులారా!

ప్రతి మానవుడు తప్పనిసరిగా సంకల్పముయొక్క శాసనమును, పనులను విశాలదృష్టితో విచారించటము అత్యవసరము. ఈ విధముగా సంకల్పముయొక్క శాసనాన్ని గుర్తించినప్పుడే మానవుడు సుఖజీవితమును, శాంతిజీవితమును అనుభవించగలడు. ఈ విధముగా మనశ్శాసనమును అర్థము చేసుకున్న సమయమునందే మానవునియందున్న సమస్తశక్తులు సద్వినియోగము కాగలవు. సంకల్పములయొక్క శాసనమును సరిగా అర్థము చేసుకున్న సమయమునందే ప్రతికూలమైన సంకల్పములను మానవుడు ప్రతిహతము చేయగలడు. మత్స్యము ప్రవాహమునకు ఎదురీదటంచేతనే తన ప్రమాదమును తప్పించుకోగలుగుచున్నది. అదే విధముగనే మానవుడు ప్రతికూలసంకల్పములకు విరుద్ధమైన సత్సంకల్పములను అభివృద్ధిపరచుకున్నప్పుడే తన జీవితములో ప్రమాదమునకు దూరమై ప్రశాంతికి సన్నిహితమై వుంటుంటాడు. సముద్రములో ప్రయాణముచేసే పడవకు దిక్సూచీ యంత్రము అనేది ఒకటుంటాది. ఈ దిక్సూచీ యంత్రమునాధారము చేసుకొనియే ప్రయాణీకులు తాము చేరవలసిన గమ్యమును సుక్షేమముగా చేరుతారు. ఈ దిక్సూచీ యంత్రము లేనప్పుడు యిది యేదో ఒక వైపుకు గాలివలన మళ్ళీ మంచుగడ్డనో, బండరాతినో కొట్టి అనేక కష్టనష్టములకు గురి అవుతుంది. అదే విధముగ మానవుడు యీ సంసారసముద్రమునందు సంచారము చేసే సమయములో

srisathyasaivachanamrutam

నిశ్చల మనస్సు అనే ఒక యంత్రాన్ని సక్రమమైన మార్గములో అనుసరించినప్పుడే సరైన గమ్యము చేర గలదు. ఆ నిశ్చల మనస్సే లేకుండిన తనయొక్క ప్రయాణము అనేక విధములైన ప్రమాదములకు గురౌతుంది.

**మానవుని మనస్సులోని ప్రతి సంకల్పము ముఖములో ప్రకటితమవుతూంటుంది**

మనిషియొక్క ముఖము మనస్సుయొక్క ఒక ముద్రనే! దీనియొక్క ప్రతిబింబమే! మనస్సుయొక్క ఛాయాచిత్రమే! కనుకనే మనస్సునందు మానవుడు సంకల్పించుకొనే ప్రతిసంకల్పముకూడను మనిషి ముఖమునందు ప్రకటింపబడుతూ వుంటుంది. మనిషియొక్క మనస్సు ఒక గ్రామఫోను ప్లేటు వంటిది. ఈ ప్లేటులో వుండిన పాటలో మాటలో మనకు కనుపించవుగాని వినిపించుతాయి. కాని మనస్సునందున్న సంకల్పములయొక్క ప్రభావములు మనకు వినిపించవుకాని, కనిపిస్తాయి. మనసునందు కలిగిన ప్రతిసంకల్పముకూడను అనగా దుష్టసంకల్పములుగాని, సత్సంకల్పములుగాని మానవుని ముఖమునందు ప్రతిబింబిస్తూంటాయి. క్రోధము, ద్వేషము, అసూయ, నిరాశ, డంబము, అహంకారము యిత్యాది దుష్టగుణములు మానవుని ముఖమునందు పుండ్లవలే మనకు కనిపిస్తూ వుంటాయి. అదే విధముగా సత్యము, ప్రేమ, సహనము, సానుభూతి, దయ, కరుణ యిత్యాది సత్సంకల్పములు మానవుని ముఖమునందు తేజోవంతముగా, ప్రశాంతమైనదిగా నిరూపిస్తూ వుంటాయి. మనస్సుయొక్క mould ముఖము అని చెప్పవచ్చును. ఇందులో ప్రతిసంకల్పముకూడను ఒక గీతవలే వెలుపలకు ప్రకటిస్తూ వుంటాది. దీనిని యింకొక రీతిగా మనము చెప్పవలెనన్న ముఖము ఒక నోటీసు బోర్డువంటిది. మనస్సుయొక్క ప్రభావములన్నియుకూడను ముఖముపైన ప్రకటింపబడుతూ వుంటాయి. ఈ సంకల్పములను మూసిపెట్టుటకై కొంతమంది ప్రయత్నిస్తూ వుంటారు. సంకల్పములను మూసిపెట్టుకొనుటకుగాని, దాచిపెట్టుకొనుటకుగాని, సాధ్యముకాదు. ఇది కేవలము ఒక మూర్ఖత్వమనియే చెప్పవచ్చును. మీరు వినివుండవచ్చును. పుస్తకములందు చదివివుండవచ్చును. ఎడారులలో నిప్పుకోడి అనే పక్షి ఒకటుండాది. ఎత్తైన పక్షి. యించుమించు పది పన్నెండు

అడుగులు ఎత్తుంటుంది యీ పక్షి. ఈ పక్షిని వేటాడుటకు అనేకమంది వేటకాండ్రు వెళ్లుతుంటారు. కారణమేమనగా దానియొక్క యీకలు మహాపెద్దవిగఉండి, అనేక విధములైన చిత్రవిచిత్రములను నిర్మించడానికి అనుకూలమైనవిగ వుంటాయి. దీని మాంసము మాంసభక్షకులకు చాలా ప్రీతిగా వుంటుంది. అందువలన యీ పక్షిని వేటాడుటకై అనేకమంది పోతుంటారు. ఆ సమయములో యీ నిప్పుకోడి యేమి చేస్తుంది? తనయొక్క పొడగాటిమూతిని యిసుకలో దాచిపెట్టికొని తనను ఎవరూ చూడలేదు అనుకుంటుంది. కాని, యీ అమాయక పక్షికి తన దేహము యింత పెద్దది వెలుపలనున్నదే అనే జ్ఞానము లేకుండా పోతుంటాది. అదే విధముగనే తమ దోషములను, తుచ్ఛసంకల్పములను దాచిపెట్టుకొనుటకై, మూసిపెట్టుకొనుటకై ప్రయత్నించేవారు కేవలము యీ నిప్పుకోడివంటివారే! వీటిని యేమాత్రముకూడను దాచిపెట్టుకొనుటకు వీలుకాదు. దుష్టసంకల్పములు దాచినను అవి దాగవు. ముఖముపైన ప్రకటిస్తూవుంటాయి. ప్రకాశిస్తూ వుంటాయి.

**ప్రతి సంకల్పమునకు ఒక పరిణామముంటుంది**

మానవుని సంకల్పములు విద్యుచ్ఛక్తికంటెను చాలా సూక్ష్మమైనవి. ప్రతిసంకల్పమునకు ఒక రూపమున్నది. ప్రతిసంకల్పమునకు ఒక పేరు వున్నది. ప్రతిసంకల్పమునకు ఒక భారమున్నది. ప్రతిసంకల్పమునకు ఒక రంగు వున్నది. ప్రతి సంకల్పమునకు ఒక పరిణామము వుంటున్నాది. ప్రతిసంకల్పము శక్తితోకూడి వుంటున్నది. కనుక, యీ సంకల్పమనేది కేవలము తెల్లని పేపరుపై వ్రాసిన అక్షరములు మాత్రమేకాదు. ఇది అనేక రకములైన మార్పులుకూడను పొందుతూ వుంటుంది. అనేక రూపములనుకూడను పొందుతూంటుంది. సమయసందర్భానుసారముగా యీ సంకల్పములు తమ ప్రభావమును అధికము చేసుకుంటాయి. దేశకాలపాత్రలను అనుసరించి సంకల్పములు పవిత్రముగాకూడా మారుతుంటాయి. అనేక శాఖలతో, పత్రములతో, పుష్పములతో, ఫలములతోకూడిన యీ సంసారవృక్షమునకు మనస్సే మూలాధారము. ప్రతిసంకల్పముకూడను కన్నుద్వారా వెలువడుతూ వుంటుంది. కన్నులు చూస్తున్నవని

సామాన్యంగా మానవులు భావిస్తారు. కానీ కన్నులు చూడటంలేదు. కన్నులతో మనస్సు చేరటంవలననే కన్నులు చూడగలుగుతున్నాయి. చెవులు వినగలుగుతున్నాయనుకుంటున్నాము. చెవులకుకూడను వినేశక్తిలేదు. చెవులయందు మనస్సు చొరపడినప్పుడే యీ చెవులు వినగలుగుతున్నాయి. ఇదే విధముగ సర్వేంద్రియములకుకూడను మనస్సు ఒక ఆధారమై, ఒక సూత్రమై, కారణమై వాటిచేత పని జరిపించుచున్నది. దీనికొక చిన్న ఉదాహరణము. పూర్వపు ప్యేలస్‌లయందు రాణివాసమని ఒక ప్రత్యేక స్థానములో మహారాణులందరుకూడను నివసించేవారు. ఈ భవనములకు కిటికీలు వుండేవికావు. చిన్న చిన్న రంధ్రములు మాత్రమే వుండేవి. ఈ రాణివాసములో వున్న రాణులు, యీ చిన్న రంధ్రముద్వారా బయట ప్రపంచాన్నంతా చూస్తూవుండేవారు. ఆ మార్గములో సంచరించే వాహనములు, మనుషులు ఇంకా చిత్రవిచిత్రమైన దృశ్యములంతా యీ చిన్న రంధ్రముద్వారానే వారు చూస్తూవుండేవారు. అయితే, బయటి ప్రపంచము మాత్రము యీ రాణులను చూడలేదు. కేవలము అంతః పురమునందు వుండిన దాసీలు మరియు రాజు మాత్రమే వారిని చూడగలరు. అదే విధముగ మనస్సు అనేది రాణివాసములో వుండిన ఒక రాణి వంటిది. ఈ మనస్సు ప్రపంచమునంతా చూస్తున్నది. కానీ యీ ప్రపంచము మనస్సును చూడలేకుండా వున్నది. అయితే యీ మనసును చూచే దాసీలు ఎవరు? ఇవే సంకల్పములు. ఈ సంకల్పములయొక్క ఉత్సాహప్రోత్సాహములచేతనే మనస్సు తన కర్మము తాను ఆచరిస్తూ వస్తుంది. ఈ రాజు ఎవరు? అదే నేను. అదే అహం. మనస్సు అనే స్వరూపాన్ని అహం అనే రాజు, సంకల్పములనే దాసీలు చెంతనే చూడగలరు.

### సృష్టిఅంతా సంకల్పములయొక్క స్వరూపమే!

సంకల్పములద్వారానే మనస్సు యేర్పడుతున్నది. ఈ సంకల్పములు 'అహం' అనే నేనుయొక్క ప్రభావమునుండి వచ్చుచున్నవి. ఈ అహం అనే నేను ఆత్మనుండి వెలువడుచున్నది. కనుక ఆత్మ, అహం, మనస్సుకూడను ఒక దానితో ఒకటి సన్నిహితసంబంధముతో కూడినవి. సమపోలికలుగల జీవులయొక్క సంకల్పములలోకూడా

sri sathyasai vahini amrutam

సామ్యము ఉండవచ్చును. కొన్ని ఉదాహరణములు. కొన్ని పక్షులు యితర పక్షులతో చేరక తాము ప్రత్యేకముగా ఒక గుంపుగా ప్రయాణమై పోతూవుంటాయి. అనగా ఆ పక్షులయొక్క సంకల్పములు సమపోలికతోకూడిన సంకల్పములు. కొంగలగుంపు అంతాకూడను ప్రత్యేకముగా పోతుందిగాని కాకులగుంపుతో చేరదు. కాకులగుంపు ప్రత్యేకముగా పోతుందిగాని, కొంగలతో చేరదు. అదే విధముగనే మృగములు. ఏనుగులు bisons తో చేరవు. bisons ఏనుగులతో చేరవు. ఈరెండింటితో జింకలు చేరవు. కారణమేమనగా, సమాన పోలికలుగల సంకల్పములే! ఒక గాయకుడు మరొక గాయకునే చక్కగా ఆకర్షిస్తాడుగాని యింకొకరిని అంతగా ఆకర్షించలేడు. ఒక అధ్యాపకుడు మరొక అధ్యాపకునితో స్నేహము చేయటానికి ప్రయత్నము చేస్తాడు. కారణమేమిటి? ఇది సమపోలికలుగల సంకల్పములయొక్క ప్రభావమే! మానవునియొక్క సంకల్పవికల్పములనేవి చాలా చిత్రవిచిత్రములుగా వుంటుంటాయి. ఏతావాతా సృష్టి అంతయు సంకల్పములయొక్క స్వరూపమనియే చెప్పవచ్చును. కన్ను చాలా చిన్న రంధ్రముతోకూడి వుంటున్నది. కానీ, యింత చిన్న కన్ను యెంతో విశాలమైన ప్రపంచాన్ని చూడగలుగుతుండాది. అనగా రాణివాసములో వున్న రాణి చిన్న రంధ్రము ద్వారా ప్రపంచాన్ని చూడగలిగినట్టు చూస్తుండాది. ఆ చూపుకూడను మనస్సుయొక్క ఆధారముచేతనే చూడగలుగుతున్నది. నీవు కన్నులు తెరుచుకొని వుండినప్పటికి, నీ మనస్సు యెక్కడో ఆలోచన చేస్తూ వుండినప్పుడు, నీ కన్నులు ఎదురుగా నుండిన చిన్న పదార్థమునైననూ చూడలేవు. కనుక, చూచేది కన్నులు కాదు. వినేది చెవులు కాదు. బాహ్యదృష్టితో చూచినప్పుడు యీ సంకల్పములప్రభావముచేత మనస్సుయొక్క కాంతియే యీ యింద్రియములచేత పనిచేయించగలుగుచున్నది.

**ఎట్టి సంకల్పములో అట్టి ఫలితములు**

ఎట్టి సంకల్పములో అట్టి ఫలితములుంటాయి. ఇది తప్పునది కాదు. నేడో రేపో కాలము కొంత వ్యత్యాసము కావచ్చునుగాని, యీ సంకల్పములయొక్క ప్రభావమైన స్వరూపాన్ని మనము అందుకొనక తప్పదు. కనుకనే సత్సంకల్పములను మనము అభివృద్ధి

srisathyasaivachanamrutam

పరచుకోవాలి. పవిత్రమైన భావములను మనము పెంచుకోవాలి. దివ్యమైన తలంపులను మనము అభివృద్ధిపరచుకోవాలి. దీనికొక చిన్న ఉదాహరణము. మనము యితరుల కీడును తలంచి అనేక సంకల్పములు చేయవచ్చును. తలంచటము సులభమే కాని దీనిని భరించటము చాలా కష్టము. ఇతరులకు కీడు చేసే తలంపు మనయందు ఆవిర్భవించినప్పుడు ఆ సంకల్పములు యితరులకు అంతో యింతో కీడు చేయవచ్చును. చేస్తాయి. కానీ, అంతటితో యీ సంకల్పములు ఆగిపోవు. మన సంకల్పములు యితరులకు యెంతకీడు చేసినవో అంతకునూరింతలు అవే వచ్చి మనకు కీడు చేస్తాయి. ఈ సత్యాన్ని, మన సంకల్పములలో వుండిన ఈ రహస్యాన్ని మాత్రం మనం గుర్తించాలి. ఇతరులను మనము యెంత బాధిస్తుమో అంతకు యెన్నో రెట్లు తిరిగి మన సంకల్పములు మనను బాధిస్తాయి. కనుకనే దుష్టసంకల్పములనేవి కేవలము యితరులను మాత్రమే కాకుండా మనలనుకూడను బాధిస్తాయి అనే సత్యమును గుర్తించాలి. విషపురుగు మట్టినవానిని, పెంచినవానిని యిరువురిని కరచినప్పుడు విషమే చేరుతుంది గాని అమృతము చేరదు, పెంచినవానికి. దుష్టసంకల్పములు ఎవ్వరినైనకూడను బాధించక తప్పదు. అది వాటి సహజము. మహాభారతమునందు మీరు విని వున్నారు. కౌరవులు దుష్టసంకల్పములచేత పాండవులను హింసించేకోసమని, పాండవులకు కీడుచేసేకోసమని అనేక విధములైన పథకములను అభివృద్ధిపరచుకొన్నారు. ఫలితంగా వారి సంకల్పములు అంతోయింతో పాండవులను హింసించాయి. కాని, అంతకంటే అధికముగా వెనుతిరిగి కౌరవులనే హింసించాయి. మన సంకల్పములు దుష్టసంకల్పములైనప్పుడు అవి యితరులకంటె మనకే ఎక్కువ కీడు చేస్తాయి. సత్సంకల్పములే అయిన యితరులకు, తనకు, పరిసర ప్రజలకుకూడను కొంతవరకు మేలు కలిగిస్తాయి. కనుక, సంకల్పములు పుట్టిన తక్షణమే మంచి, చెడ్డలయొక్క విచారణ చేయాలి, "ఈ సంకల్పములు మానవత్వాన్ని నిలిపేవా లేక పోగొట్టేవా? నా కీర్తిగౌరవములు పెంచేవా లేక నన్ను హతము చేసేవా?" అని. ఈ విధముగా మంచి, చెడులు విచారించి చెడ్డ కల్గించేవైనట్లైన తక్షణమే వాటిని దూరము చేయటానికి ప్రయత్నించాలి. అయితే, దుష్టసంకల్పములను దూరము చేసే విధానము యేమిటి? ఈ దుష్టసంకల్పములను దూరమే చేసే విధానము అంటూ వేరే ఏదీ లేదు.

sri sathyasai vahanamrutam

సత్సంకలములు అభివృద్ధిపరచుకున్నప్పుడే దుష్టసంకల్పములు దూరమవుతాయి. చుట్టూ వున్న దుర్గంధమును దూరము చేయాలంటే ఒక అగరువత్తో, సాంబ్రాణో వెలిగించి సుగంధమును fill చేసి, తద్వారా ఆ దుర్గంధము మనకు సోకకుండా చూసుకోవచ్చు. అదే విధముగనే మనలో కలిగే దుష్టసంకల్పములకు విరుద్ధముగా సత్యసంకల్పములను అభివృద్ధిపరచుకున్నప్పుడు యీ దుష్టసంకల్పములు సులభముగా దూరమవుతాయి.

**దుష్టసంకల్పములు బయలుదేరిన తక్షణమే వాటిని తృంచివేయాలి**

ప్రతివిషయమందుకూడను సంకల్పము పుట్టిన తక్షణమే మనము విచారణ సలపాలి. ఈ సంకల్పముయొక్క భవిష్యత్తు ప్రభావము యెలాంటిది అనే దానిని మనము విచారించాలి. ఒక్కొక్క పర్యాయము మన సంకల్పములు యింకొకరు పసికట్టే అవకాశముకూడా వుంటుంటాది. పూర్వము మహర్షులందరు యిదే విధముగనే సత్సంకల్పములను పసిగట్టి ఆ సత్సంకల్పముల ప్రభావముచేత ఒకరికొకరు సన్నిహిత సంబంధబాంధవ్యులై దివ్యాత్మతత్త్వాన్ని గుర్తించుకోగలుగుతూ వచ్చారు. ఒక చిన్న కథ. హాలెండులోపల టెడ్‌బ్రోస్టిక్ అనే ఒక రైతు వుండేవాడు. ఇతను అవివాహితుడు. అనగా పెండ్లికానివాడు. ఇతనికి తల్లి, ఒక సోదరుడు వుండేవారు. జీవితాన్ని ప్రశాంతముగా గడపాలని వూరికి వెలుపలకుపోయి నలభై ఎకరముల ప్రదేశము కొని అందులో ఒక గుడిసె వేసుకొని తల్లి, తమ్ముడు, టెడ్ యీ ముగ్గురు మాత్రమే వుండేవారు. పంటలు పండించుకుంటూ ఒక మూలన కొన్ని కోడిపిల్లలను పెంచుకుంటూ కాలము గడుపుతూ వుండేవారు. ఒకనాటి రాత్రి ఎక్కడనుండియో ఒక నక్క ప్రవేశించి యీ కోడిపెట్టలను భుజించి శాంతముగా వెళ్ళిపోయింది. రెండవ దినము యీ నక్క నెట్లాగైనా పట్టాలని సంకల్పించుకొని యితను తుపాకిని దగ్గరపెట్టుకొని కూర్చున్నాడు. ఇతను నిశ్చల చిత్తుడు. కానీ దేశానుగుణ్యముగా యీ కోళ్లను పెంచుకోటము, వాటిని భుజించటము, వానిని రక్షించుకోటము తన కర్తవ్యముగా భావించాడు. ప్రతిదినము యీ నక్కను కొట్టేనిమిత్తమై పొంచి వుండేవాడు. ఈ విధముగా ఒక దినము, రెండు దినములు, మూడు దినములు కాదు, ఐదు సంవత్సరములు కాచుకున్నాడు. నక్క చిక్కలేదు. నిత్యము కోడిపెట్టలు



srisathyasaivachanamrutam

పోతున్నాయి. దీనికి కారణమేమిటి అని విచారిస్తూవచ్చాడు. నక్క వచ్చే శబ్దము వినిపిస్తున్నాది. కోళ్లు అరిచే శబ్దము వినిపిస్తున్నాది. తిరిగి పరుగెత్తే శబ్దము వినిపిస్తున్నాది. కానీ నక్క కనుపించటములేదు. ఈ విధమైన రహస్యము పదిమందికి తెలుపుతూ వచ్చాడు. 'ఈ నక్కను యెట్టాగైనా పట్టాలి, ఎట్లాగైనా కొట్టాలి. ఎందుకు చిక్కటంలేదు?' అని వారందరు దీర్ఘంగా ఆలోచించారు. ఈ సమావేశములోపల ఇతని మనస్తత్వము గుర్తించిన ఒక నిర్మలచిత్తుడు దీనికి సరైన జవాబు చెప్పాడు: "నాయనా! నీవు దానిని చంపాలని సంకల్పించుకుంటున్నావు. నక్క అయినా పరవాలేదు. మానవులయొక్క దుష్టసంకల్పములు, సత్సంకల్పములు మృగములుకూడను గుర్తించటానికి ప్రయత్నిస్తూవుంటాయి."

ఒక చిన్న ఉదాహరణము. మన నిత్యజీవితములో చూస్తూనే వుంటున్నాము. మనము యేదో ఒక మార్గములో నడుస్తూ పోయే సమయములో ప్రక్కనే ఒక గుంతలో ఒక కుక్క పరుండి వుంటాది. మనలో ఎట్టి విరుద్ధమైన సంకల్పములు లేనప్పుడు అది నిర్భయముగా పరుండి వుంటాది. దాని ప్రక్కనే వెళ్లినప్పటికి అది లేవదు. నీవు యిరవై అడుగుల దూరమునుండి యీ కుక్కను కొట్టాలి అని సంకల్పించుకొనిరా. నీవు అక్కడకు వస్తున్నట్టే యీ కుక్క చక్కగా అక్కడనుండి వెళ్లిపోతుంది. దీనిని బాగా గుర్తించండి. ఈ కుక్కలకుకూడను మానవులందున్న దుష్టసంకల్పములు మరియు సత్సంకల్పముల వాసన పసికట్టే శక్తి వుంటుండాది. పశువులకు, మృగములకే యీ విధముగా గుర్తించే శక్తి, సామర్థ్యములు వుండినప్పుడు మానవునియందు ఉండవా? మానవునియందుకూడను తప్పక వుంటవి. కాని, మానవుడు తన సంకల్పములను మూసిపెట్టుకొనుటకై ప్రమత్నిస్తాడు. ప్రతి ఒక్క వ్యక్తియొక్క మనోభావములను చక్కగా మీరు ముఖములో గుర్తించటానికి వీలవుతుంది. ఒక తప్పు పని చేసిన వ్యక్తో, లేక పరులసొత్తు అపహరించిన వ్యక్తో, పరులను దూషించిన వ్యక్తో లేక అసత్యములాడిన వ్యక్తో ఎదురుపడినప్పుడు నీవు వాని ముఖమును చక్కగా పరీక్షించి చూడు. ఒక విధమైన భయభ్రాంతులు అతనిలో చేరటముచేత అతని బ్లడ్‌సెల్సు దెబ్బతింటాయి. నరములు బలహీనమైపోతాయి. పెదిమలు అదరిపోతాయి. దిగ్భ్రాంతిగా తన ముఖమే మారిపోతుంది. క్రమక్రమేణా అతనియొక్క

ఆరోగ్యముకూడను చెదిరిపోతుంది. కనుక, సంకల్పములను మూసిపెట్టటముచేత చాలా ప్రమాదము వుంటుండాది. పోనీ బయటకు చెప్పుకుందామంటే నలుగురిలో అవమానమవుతుంది. అలా చెప్పుకోటము చాలా అవమానము. మూసిపెట్టుకొనటముకూడా ప్రమాదము. కనుక, దుష్టసంకల్పములను తక్షణమే తృంచివేయటానికి ప్రయత్నించాలి. ఈ దుష్టసంకల్పములు చాలా శక్తివంతమైనవై మన జీవితాన్ని అంతకూడను సాధిస్తూవుంటాయి.

**మొట్టమొదట మన మనస్సును పవిత్రముగా ఉంచుకోవటానికి ప్రయత్నము చేయాలి**

దేశములో యీనాడు అనేక విధములైన అక్రమములకు, అన్యాయములకు, అశాంతికి మూలకారణము, మానవులయొక్క దుష్టసంకల్పములే! కొన్ని పరిమితమైన సంకల్పములున్నాయి. కొన్ని అపరిమితమైన సంకల్పములుంటున్నాయి. మనము ఎప్పుడు చూసినా కూడను చెడ్డవిషయాలు వినకూడదు. చెడ్డదృశ్యములు చూడకూడదు. చెడ్డవిషయాలు చెప్పకూడదు. చెడ్డది ఏమియు మనము చేయకూడదు. అందుకోసమే అనేక పర్యాయములు నేను See good, be good, do good అని చెప్పుతూ వుంటాను. మనము ఏ విధమైన సంకల్పములు చూస్తుమో, విందుమో, చెప్పుదుమో అవన్నీ కూడను సంస్కారరూపములో ఒక రూపాన్ని ధరిస్తూ వుంటాయి. ఇవన్నీ మన నిత్యజీవితములోపల అణువణువన మనకు అడ్డుతగులుతూ వుంటాయి. చెప్పాలనుకుంటే ఉదాహరణముగా కొంతమంది లాయర్సు వుంటారు. కొంతమంది జర్నలిస్టులంతావుంటారు. వీళ్లు వినేది, తలచేది, చెప్పేదీ అంతా చెడ్డనే! ఎందుకంటే, యీ కంప్లైట్సు అంతా వాళ్లకు చేరుతుంటాయి. కనుక, వారి ముఖములంతా పీడముఖములుగా వుంటుంటాయి. కారణమేమంటే లోపలంతాకూడను దుష్టసంకల్పములు యెప్పుడు చూసినా అదే పని చేస్తుంటాయి. దానికి ఏ విధముగా విరుద్ధము చేయాలి? వానికి ఏ విధముగా విరుద్ధము వ్రాయాలి, యిలా వారిలో అన్నీ దుష్టసంకల్పములే! కాలినుంచి తలవరకు చేరి వుంటాయి. ఇందుకు విరుద్ధముగా మహర్షులు వుంటూవుంటారు. వారు నిరంతరముకూడను సత్సంకల్పములనే పోషించుకుంటూవుంటారు. సత్సంగమునే చేరుతూవుంటారు.

sri sathyasai vachanamrutam

సద్విషయములనే వింటూవుంటారు. కనుకనే వారియొక్క ముఖములో బ్రహ్మతేజస్సు ఉట్టిపడుతూ వుంటుంది. వారిని చూస్తూనే ఆకర్షణీయమైన భావము మనలో ఆవిర్భవిస్తూవుంటుంది. ప్రతి ఒక్క మంచి చెడ్డలకుకూడను మనముఖమే అద్దము, మన ముఖమే మనస్సుయొక్క పోత, మన ముఖమే మనస్సుయొక్క నోటీసుబోర్డు. కనుక, మొట్టమొదట మన మనస్సును పవిత్రము చేసుకోటానికి ప్రయత్నము చేయాలి. చిన్న ఉదాహరణము. మీలో కొంతమంది సైన్సు boys కూడా వుండవచ్చు యిక్కడ. కలకత్తాయందో లేక ఢిల్లీయందో ఆకాశవాణిలో కొన్ని కార్యక్రమాలు జరుగుతూ వుంటాయి. తక్షణమే మనము రేడియో స్విచ్ వేసి స్టేషను adjust చేస్తే క్షణములోపల ఆ కలకత్తాలో జరుగుతున్న ప్రోగ్రాము అంతా మనకు యిక్కడ వినిపిస్తుంది. అనగా శబ్దము కొన్ని వేల మైళ్లు ప్రయాణము చేస్తుంది, క్షణానికి. ఇంక కాంతి. సైన్సుపిల్లలకు తెలిసివుండవచ్చును. ఒక్క క్షణానికి లక్షా ఎనభైఆరు వేలమైళ్లు ప్రయాణం చేస్తుంది. ఆధునిక యుగంలో శాస్త్రపరిశోధనలు యెన్నో వస్తున్నాయి. కాంతి కంటే మహావేగముతో పరుగెత్తేది మైండ్. శబ్దముకంటే కాంతి, కాంతికంటే మైండ్ అనగా మనస్సు. యీ మనస్సు మరింత వేగముతో వుంటుంది. ఇట్టి వేగముతోకూడిన యీ మనస్సును మనము అదుపులో పెట్టుకొనకుండిన చాలా ప్రమాదము సంభవిస్తుంది. స్పీడుగా పోయేకారుకు ఏ బ్రేకో, ఏ క్లచ్చో, ఏక్సెలరేటరో, ఏ విధమైన స్టీరింగో కొంచెము లూజుగా వుంటుంటే ప్రమాదము సంభవిస్తుంది. మనస్సు చాలా వేగముతోకూడినది కనుక, సంకల్పములతో చేరినది కనుక, మన సంకల్పములను సరైన అదుపులో పెట్టుకోటము శ్రేయస్కరము. కోపము వచ్చినా లేక దుఃఖము వచ్చినా, యింకే విధమైన నిరాశలు కలిగినా తక్షణమే మనము దానికి చోటివ్వరాదు. శాంతముగా విచారించి, దీనికి కారణములు వెతికి, దీని మంచి చెడ్డలు చర్చించి తదుపరి యీ విషయమునకు మనము చోటివ్వాలి. అట్లుకాకుండా తక్షణమే మనము మనస్సును అనుసరిస్తూవుంటే పశువులమైపోతాము.

**మనసు నాధారముగ గొను మానవుండు**
**పశువుకంటెను హీనమై పతనమగును**
**బుద్ధినాధారముగ గొను బుధజనుండు**

అనగా మనస్సు సంకల్పించిన ప్రతిదానినికూడను బుద్ధి విచారణ చెయ్యాలి. దానినే "బుద్ధి గ్రాహ్యమతీంద్రియమ్" అన్నారు, వేదాంతమునందు. తక్షణము ఒకరిని నిందించటముగాని, ఒకరిని దూషించటముగాని, ఒకరిని దోషిగా పరిగణించటముగాని తొందరపడి యేమాత్రము చేయకూడదు. ఇవన్నీకూడను దుష్టసంకల్పములతో చేరిన దుష్ఫలితములే!

**మన అదృష్టమునకు, దురదృష్టమునకు మన సంకల్పములే మూలకారణము**

మొట్టమొదట సత్ సంకల్పములనే విత్తనములు మంచికర్మలు అనే ఫలములనుండి పుట్టుచున్నవి. ఈ కర్మలనే విత్తనములనుండి సాధనలు అనే ఫలములు లభించుచున్నాయి. ఈ సాధన అనే విత్తనము నాటినప్పుడు శీలము అనే ఫలము లభిస్తున్నాది. ఈ శీలము అనే విత్తనము నాటినప్పుడు మనకు అదృష్టమనే ఫలము లభిస్తున్నాది. మన అదృష్టమనేది మంచిగా వుండాలనుకుంటే మన శీలము అనగా character సరియైనదిగా వుంటుండాలి. ఈ character సక్రమమైనదిగా వుండాలనుకుంటే మనయొక్క సాధన సరైనదిగా వుండాలి. అనగా నిత్యజీవితములో మన నడత. యీ సాధన సక్రమమైనదిగా వుండాలంటే చేసే కర్మలు పవిత్రమైనవిగా వుండాలి. ఈ కర్మలు పవిత్రముగా వుండాలంటే సంకల్పములు పవిత్రముగా వుంటుండాలి. కనుక, అదృష్టమునకు, దురదృష్టమునకు మన సంకల్పములే కారణము. మన దుఃఖమునకు, ఆనందమునకు, కష్టములకు, నష్టములకు, ఆదాయమునకు, బాధలకు అన్నింటికికూడను సంకల్పములే మూలకారణము. అందువలన సత్సంకల్పములు కావలెనంటే సత్సంగముకావాలి. చదువులచేతగాని, ఐశ్వర్యముచేతగాని, బలముచేతగాని, కీర్తి మర్యాదలచేతగాని యీ సంకల్పములు లభించేవికాదు.

**భగవత్ప్రసాదితమైన పవిత్రశక్తులను నీ ఆనందముకొరకు, పదిమందికి పంచటానికి వినియోగించాలి**

సంకల్పములు స్వసంకల్పములు. అవి వ్యక్తియొక్క పవిత్ర హృదయమునుండి



sri sathyasai vahini amrutam

ఆవిర్భవించాలి. 'నేను గొప్ప విద్యావంతుడను', అని అనుకోటంచేత గర్వమేర్పడవచ్చును. 'నేను గొప్ప తెలివితేటలు కలవాడన'ని అనుకోటంకూడను ఒక అహంకారముగా మారవచ్చును. 'నేను శ్రీమంతుడిని' అని అనుకోటంకూడను ఒక విధమైన అహంకారమే! 'నేను బలవంతుడిని' అని అనుకోటంకూడా అహంకారమే! ఈ బలము, సంపద, చదువు, తెలివితేటలు, ఇవన్నీ భగవంతుడు నీకిచ్చినది, అహంకారపడటానికికాదు. ఈ పవిత్రమైన శక్తులవల్ల నీ జీవితాన్ని ఆనందపరచుకొని ఆ ఆనందాన్ని పదిమందికి పంచటానికి ప్రయత్నించాలి. నీ తెలివితేటలతో మంచిని పెంచుకో! నీ చదువుతో వివేకాన్ని పెంచుకో! నీ వివేకముతో వినయాన్ని పోషించుకో! వాటిని సమాజములో పంచిపెట్టు. ఇదే సత్సంకల్పములయొక్క పవిత్రమైన ఫలితము. సంకల్పములనేవి చాలా వుత్కృష్టమైనవి. ఆకాశముకంటే విశాలమైనవి. విద్యుత్‌శక్తి కంటే సూక్ష్మమైనవి. మనకు కనిపించవుగాని సంకల్పములు అనేక కర్మల ఫలితాల్ని మనచేత అనుభవింపచేస్తూ వుంటాయి. యీనాడు మనము నేర్చుకోవలసిన విద్య యిదియే! సత్సంకల్పములను అభివృద్ధి పరచుకోటము. ఎట్టి సంకల్పములో అట్టి ఫలితములను మనము అనుభవిస్తూ వుంటాము.

**వేసుకుందురు మీరు విషమిచ్చు విత్తనములు**
**ఆశింతురు నేడు అతిరుచ్యఫలములు**
**కాసిన కడు చేదుకాయలు తినలేక**
**దోషము దేవునిపై త్రోసి వాదింతురు**

వేసుకొనేది విషవిత్తనాలు, ఆశించేది మధురఫలములు. కాసిన చేదుకాయలు తినలేక దేవుడు ఈ విధమైన చేదుకాయలిచ్చాడని నిందించటము. ఇవి దేవుడిచ్చినవికాదు, నీవు పెంచుకున్నవే! కనుక, నీవు మంచి విత్తనములునాటు. మంచిఫలములు పొందు. ఇదే విధముగనే సంకల్పములయొక్క ప్రభావములను గురించి అనేక పర్యాయములు చెప్పాను.

**మానవుడు ఆనందపిపాసి**

ఈ సంకల్పములయొక్క ప్రభావమును చక్కగా గుర్తించినప్పుడే మానవత్వము యెంత



srisathyasai vahini.org

విలువైనదో మనము చక్కగా గుర్తించుకోటానికి వీలౌతుంది. నిజముగా మానవునియందుండిన ప్రధానమైన రహస్యాన్ని మీరు చక్కగా అర్థము చేసుకుంటే మానవత్వము యొంతవిలువైనదో మీకు తెలుస్తుంది. 'జంతూనాం నరజన్మదుర్లభమ్' అనే విషయాన్ని మీరు చక్కగా అనుభవించగలరు. మానవునియందున్న ఒక్క విశిష్ట లక్షణము మరి యే ఇతర జీవరాసులయందుకూడను లేదు. ఏమిటి ఆక్వాలిటీ? నవ్వటము. ఏ జంతువులుగాని, పక్షులుగాని, మృగములుగాని నవ్వవు. అనగా మానవుడు ఆనందమయుడు అని అర్థమవుతుంది. ఆనందాన్ని ఆశించేవాడు కనుక, ఆనందపిపాసి మానవుడు, అన్నారు. ఇట్టి ఆనందమయుడైన మానవుడు దుఃఖమును అనుభవించుటకు కారణమేమని question వేసుకోండి. ఆనందమునకు విరుద్ధమైన పనులను ఆచరిస్తున్నాడు కనుకనే, మానవుడు ఏడ్చుతున్నాడు. మనము ఏ కార్యము చేసినా ఆనందమును అందించే కార్యముగా ఆచరించాలి. ఈ నవ్వులలో మూడురకములైన నవ్వులుంటున్నాయి. కేవలము హాస్యముగా నవ్వేది ఒకటి. ఒక విధమైన విరక్తిగా నవ్వేది ఒకటి. అనగా మన జీవితములో కొన్ని విధములైన ఫలములు మనకు లభించకపోవటముచేతను, కొంత disappoint కావటంచేతను (ఛీ...) అని యీ నవ్వు ఒక విసుగుతో పోయేది. మరొక రకమైన నవ్వు ఏమంటే చాలా బిగ్గరగా చిన్నదానికి పెద్దదానికి హాస్యముకాని దానికి, హాస్యముఅయినదానికి అన్నిటికి నవ్వటమే! ఇది చాలా చెడ్డది. ఈ విధముగా నవ్వకూడదు మనము. నవ్వేనవ్వు ఒక పెద్ద శబ్దము కలిగించేదిగా, పెదవులు విరిచి పండ్లు కనిపించేటట్లుగా, నోరు పెద్దగా తెరచిగానీ నవ్వకూడదు. కారణమేమంటే ఇటువంటి నవ్వు దుఃఖానికి హేతువు. నిజానికి సరైన నవ్వు ఒకటి వుంటుండాది. అదేమంటే చిరునవ్వు. అది శబ్దము చేయదు. పండ్లు కనుపించవు. పవిత్రమైన హృదయముతో ముఖమును వికసింపజేసే నవ్వు, ఆ చిరునవ్వు ఒక్కటే! ఆ చిరునవ్వు చిందులు తొక్కే కార్యములు ఆచరించటమే మన కర్తవ్యము. కొంతమంది హాస్యము చేసి అందరిని నవ్విస్తూవుంటారు. మనము చిరునవ్వు నవ్వి, మనద్వారా యితరులను చిరునవ్వు నవ్వించే సంకల్పములను పోషించుకోవాలి. ఈ విధమైన జీవితాన్ని గడపటమే మానవుని ప్రధానకర్తవ్యము. ఇది ఒక్క ఆధ్యాత్మిక మార్గమందు తప్ప అన్యమార్గమందు మనకు

srisatyasaivachanamrutam

లభించదు. అంతఃకరణ చతుష్టయము అంటారు. అంతఃకరణములు నాలుగు-మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము. యివి అంతఃకరణయొక్క స్వరూపాలు. ఈ అంతఃకరణ చతుష్టయములో మొట్టమొదటిది మనస్సు. అన్నింటికిని మనస్సే సారధ్యము వహిస్తుంది. మనసును అదుపులో వుంచుకున్నప్పుడు మన జీవితము ధన్యమవుతుంది.

**పునర్జన్మ, జన్మరాహిత్యము రెంటికి కారణము, మనసే!**

మనసుచే జన్మలు ఉద్భవించు. మనము తిరిగి యెన్నో జన్మలెత్తటానికి మనసే కారణము. మనసుచే జన్మలు మాయమైపోవు. జన్మరాహిత్యమై పోయి జన్మలేకుండా వుండటానికికూడను మనసే కారణము. మనసుచే ధర్మార్థకామమోక్షములనే చతుర్విధ పురుషార్థములుకూడను సార్థకమైపోతాయి. మనసుచే యోగనిష్ఠలు ప్రకాశించు. ఈ మనసుచేతనే మనము చేసే కర్మయోగము, జ్ఞానయోగము, భక్తియోగము, రాజయోగము, క్రియా యోగము యిలాంటి యోగములన్నికూడను సిద్ధిని పొందుతాయి. బంధమోక్షములకు మనసే కారణమని భావించే వేదాంతమునందు 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్నారు. మనసే మన జీవితము. మనసే మన ప్రాణము. మనసే యీ ప్రపంచము. మనసే ఒక పదార్థము. మనసే లేకపోతే యీ టంబ్లరే లేదు. మనసే లేకపోతే యీ మైకే లేదు. మనసే లేకపోతే యీ టేబులే లేదు. సమస్త పదార్థములు మనస్సుయొక్క ఆకారములే! మనస్సునుండి ఆవిర్భవించినవే సర్వము. కనుక యీ మనస్సును పవిత్రమైన సంకల్పములచేత నింపుకోవాలి. సమస్త చైతన్యముకూడను యీ మనస్సునందే యిమిడి వుంటున్నాది. ఈ మనస్సనేది విశాలము చేసుకొందుమా అదే దైవాకారము ధరిస్తుంది. ఈ మనస్సును అధోగతిపాలు చేస్తిమా యింక అన్ని విధములుగా పతనమైపోతాము. ఈ మనస్సును విశాలము చేసేకొలది పవిత్రమైన మార్గాన్ని అభివృద్ధి చేస్తుంది. కనుక, మనము మనసును సరైన మార్గములో పెట్టాలి. ఈ మనసు యెక్కడనుంచి వచ్చిందో అక్కడకు దీనిని చేర్చటానికి ప్రయత్నించాలి. మనస్సును అహంలో చేర్చుకో! 'నేను' అనే దానిలో యీ మనసును ఐక్యము చేయి. అప్పుడు 'నేను, నేనే'

sri sathyasai vachanamrutam

అయిపోతుంది. అందుకు విరుద్ధముగా మనసును ప్రత్యేకముగా పెట్టుకున్నప్పుడు 'నేను', 'మనిషి' అయిపోతుంది. 'నేను మనిషి' అనేది పరిమితము. 'నేను నేను' అనేది అపరిమితము. 'నేను నేననే'ది అహం. 'నేను మనిషిని' అనేది అహంకారము. అహమునకు ఆకారము చేరింది కాబట్టి అహంకారమైపోయింది. ఆకారము వుండినంతవరకు ఆహంకారమే అయిపోతుంది. కనుక, నేను నేనుగా మారిపోవాలి. ఇదే నిజమైన అహంతత్త్వము. సంస్కృతభాషలోపల కొన్ని అక్షరములుంటున్నాయి. మొదటిది అ. కడపటిది హ. ఈ రెండుచేరితే అహ. ఈ రెండింటిని చేర్చినప్పుడు మన జీవితము ఒక పూలమాలవలే కట్టుబడిపోతుంది. ఈ రెండింటిని మననము చేసుకోవాలి. 'అ'.'హ', ఈ రెండు కలసి 'అహం'. యీ రెండింటిని మనము వశము చేసుకుంటే జీవితమంతా మనకు ఆధీనమైపోతుంది. అహంతత్త్వమనేది ego గా మారకూడదు. అనగా అహంకారముగా మారకూడదు. ఆత్మగా మారాలి. అహం, ఆత్మ. అందుకోసమే దీనికి మూడు పేర్లు పెట్టారు. 'అహం దేహోస్మి' నేను దేహమును అనే భావన. 'అహం జీవాస్మి', నేను సూక్ష్మమైన స్వరూపమును; 'అహం బ్రహ్మోస్మి', నేను బ్రహ్మమునే! అనే భావన. అహం బ్రహ్మోస్మియే నీయొక్క ఆకారము. కనుక, బ్రహ్మతత్త్వములో యీ మనస్సనే తత్త్వమును అంకితము చేయి. మనస్సును సత్సంకల్పములచేత నింపు. Good thoughts వల్లనే Good mind, Good mind వల్లనే GOD. కనుక, యీ మనస్సుయొక్క సంకల్పములను చక్కగా గుర్తించి పవిత్రమైన సంకల్పములను అభివృద్ధిపరచుకోటానికి విద్యార్థులు యీ లేతవయసునందే తగిన కృషి చేయటము చాలా అవసరమని బోధిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 10-07-1986న ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam